# కాలగమనంలో సరోజ

(ఒక అనుభూతి)

నిన్నటికి నిన్న సరోజకి ఏడేళ్లు. ఈవాళ పదిహేడేళ్లు. ఒక తరంగం ఆమెని బాల్యావస్థలోంచి యౌవనానికి మోసుకుపోయింది. తరంగాల దిక్కుని గాలి మార్చేటట్టే, కాలంకూడా ఆమె జీవితనావ చుక్కానిని తిప్పేసింది.

మార్పు! నిన్న చేతులతో ముట్టుకున్నా కాలని నిప్పు ఈవాళ దూరంనించే వేడిగా ఉంది. నిన్న తాను వీధులవెంట స్వేచ్ఛగా ఆడుకుంది. ఈవాళ బయటికేనా తొంగి చూడకూడదు. నిన్నటివరకూ ఆమెకి ప్రపంచపు జోక్యమే లేదు నిన్నటివరకూ ఆమె కిలకిలా నవ్విన నవ్వు ఈవాళ ఆమె పెదవులలోపలే అంతర్లీనమైపోయింది. ఈవాళ ఆమె బాధ్యతంతా నెత్తిమీద భరించవలసిన యువతి. ఇదే జీవితం!

ఆమె మనస్సిప్పుడు పదిసంవత్సరాల గతాని కోసం పరుగులెత్తూంది. ఆమె కష్టంతో ఆ భావాల్ని ఒక్కసారిగా పారదోలుకుంది. ఇంతలో ఆమె మనస్సు చాలాదూరంలో జరగబోయే భవిష్యత్తునిగురించి ఆలోచించ సాగింది. ఇలాగ ఆమె మనస్సు గడియారపు లోలకంలాగ ముందుకీ వెనక్కీ పరిగెడుతోంది.

ఆమె అద్దంముందు నిలబడి చూసుకుంది. ఎంతమార్పు! తాను చిన్నపిల్లగా ఉండేటప్పుడు గబగబా పెరిగి పెద్దదాన్నవుదా మనుకుంది. ఈవాళ తిరిగి చిన్నపిల్లగా మారిపోదా మనుకుంటోంది. నిన్నటికోరిక నిజమైందిగాని ఇవాళటి కల, కలే అయింది. ఇది అసంభవమని ఆమెకి తెలుసు. కాని ఆమె ఈ కోర్కెని అణగదొక్కలేకపోతోంది.

ఆమె నిస్పృహతో నిట్టూర్చింది. వాతావరణమే గంభీరంగా ఉంది. గదిలో వస్తువులన్నీ ఆమెని వింతగా చూస్తున్నాయి. ఆమె పిచ్చితనానికి గదిలో కుర్చీలు నవ్వుకున్నాయి.

ఆమెకి నిన్నసాయంత్రమే పెళ్ళి అయింది. ఈవాళ శోభనం. ఈ శుభసమయం ఆమెకి కఠోరపరీక్షగా ఉంది. అదుగో, ఆ సమయం సమీపిస్తోంది. రాత్రి పదిగంటలకి. ఇప్పుడే సాయంకాలమయింది. కొద్దిసేపటిలో చుక్కలు ఆకాశంలో విహరిస్తాయి.

ఆమెకి తెలుసు ఈ రాత్రితో ఆమె జీవితం అంతా విషపూరితం చెయ్యబడుతుందని. ఈ రాత్రుళ్లూ, పగళ్లూ కలిసిన ఈ జీవితం ఒక తెల్లరాళ్లూ, నల్లరాళ్లూ గుచ్చిన ఒక రత్నాల హారంలాంటిది కాని ఈ హారాన్ని బద్దలు కొడితేనే గాని నల్లరాళ్లని ఊడదియ్యడం సాధ్యంకాదు ఆమెకీహారాన్ని బ్రద్దలుకొట్టడానికి తగిన బలంలేదు.

ఆమె పరుపుమీద కూర్చుని, తన నలుప్రక్కలా చూసుకుంది. ఈ పరుపు దుప్పట్లు రంగులు మారినట్టే, జీవితపు రంగులూ మారతాయి కాబోలు! ఇదే గదిలో ఒక నెలక్రితమే తన అక్క మరోలోకానికి వెళ్ళిపోయింది.

* * *

సరోజ వొళ్లు ఒక్కసారి జలదరించింది. పదేళ్ళక్రితం ఒక పెద్దమనిషి తన అక్కని తీసికెళుతూండగా చూసింది. అతను ఇవాళ తనకే భర్త. అప్పుడు తన అక్క ఎదురుగా 'ఒట్టి సరూ!' అనేవాడు. కాని అదేమాటలు ఈవాళ ఇంకో విధంగా ధ్వనిస్తాయి.

సరోజ అతనితో అగ్నిసాక్షిగా సప్తపాదాలు తొక్కింది. ఈ అగ్నిలోనే తన తల్లి తన హృదయాన్ని బలి ఇచ్చింది. తన అక్క బూడిదైనచోట అతడు తిరిగి నూతన వృక్షాన్ని నాటుకున్నాడు.

ఆమె మనస్సులో ఎలాంటి తుపాను చెలరేగుతూన్నా ఆకాశం మాత్రం నిశ్చలంగా, గంభీరంగా అలముకొని ఉంది. ఒక ఎద్దుబండి ఆ వీధివెంటనే వెడుతోంది. ఇంతలో ఆమెకి

యస్. పి. సత్యనారాయణాచార్య

తన తండ్రి ఒకప్పుడు అన్న మాటలు జ్ఞాపకానికొచ్చాయి: 'సరూ, ఈ జీవితం ఒక ఎద్దుబండిలాంటిది. ఒక్క ఇరుసు మేకు పోయిందంటే చాలు, బండి ఛిన్నాభిన్నమైపోతుంది' అన్నారు. అప్పుడామెకీ మాటలర్థం కాలేదు. ఇప్పుడామెకి తెలిసివస్తోంది. తండ్రి పోయాడు. ఇరుసు మేకు పోయింది. చక్రాలు ఊడాయి. బండి రోడ్డుమధ్య కుప్పగా కూలబడి పోయింది.

నిర్మల ఆడుకుంటూ, సరోజకొంగు పట్టుకుని లాగటం ఆరంభించింది. సరోజ నిర్మల అమాయకపు కళ్ళవంక చూసి ఆమెని ఒళ్ళోకి తీసుకుంది. నిన్నటివరకూ ఆమె నిర్మలపిన్ని. ఈవాళ సవితల్లి.

'పిన్నీ, అమ్మని నీతో ఎందుకు తీసుకురాలేదు?' అమాయకంగా అడిగింది నిర్మల.

అతి కష్టంతో వస్తూన్న దుఃఖాన్ని అణచుకుంది సరోజ. నిర్మల ఇంకా వాళ్ళమ్మకోసం కనిపెట్టుకూర్చుంది. తనే యిప్పుడు వాళ్ళమ్మని దానికింకా తెలియదు. 'చిట్టి సరూ' అని అతడన్నదానికి ఇవాళ వేరే అర్థం ఉండొచ్చు. కాని నిర్మల నిఘంటువులో 'పిన్ని'కి ఒకటే అర్థం. సరోజ ఎప్పటికీ నిర్మలకి 'పిన్నే'.

నిర్మల అడిగిందానికి జవాబు చెప్పకుండా 'నిర్మలా, నువ్వు ఆడుకోడానికి వెళ్ళు. అదుగో పద్మ నీ కోసం కాచుకుంది' అంది సరోజ.

'కాదు పిన్నీ. ముందర రేపు మా అమ్మ వస్తుందో రాదో చెప్పు పిన్నీ.'

సరోజ నిర్మలని గుండెలకి హత్తుకుని, దుఃఖం ఎంతో కష్టంతో ఆపుకుని, 'నువ్వు మరి పద్మని కొట్టకుండా ఉంటే వస్తుంది. కొట్టవు కదూ. ఇంక వెళ్ళి ఆడుకో' అంది. నిర్మల సరోజ మెడకి చేతులు పెనవేసి ఒక్క గెంతులో ఆడుకోడానికి వెళ్ళిపోయింది.

* * *

సరోజ కళ్ళు ఎదురుగా ఉన్న ఒక బొమ్మ మీద పడ్డాయి. ఒక కసాయివాడు రక్తంతో తడిసిన ఎర్రని కత్తితో ఒకగొర్రెని చంపుతూన్న దృశ్యం అది. ఆదృశ్యం వెంటనే మారిపోయింది. ఆ స్మశాన వాటికలో తన అక్క శరీరాన్ని అగ్నిజ్వాలలు మింగుతూంటే తానెంత దుఃఖించిందో! కాని ఆ సమయంలో అతని నిర్లక్ష్యత!

అంతే. ఆ దృశ్యం జరిగి ఒకే నెలయింది. అలాంటి అగ్నిహోత్రుడి ఎదురుగానే తన బావ తనని వివాహమాడాడు. తన అక్క స్థానాన్ని అక్రమంగా ఆక్రమించినట్లనిపించిందామెకి. రెండు చోట్లకి ఆమెకి మంత్రాల్లో తేడా కనిపించలేదు.

పెళ్లయి పోయింది. తన ముఖాన ఆనందమే లేదు. ఆ సమయంలో ఆమె ఒక నిర్జీవ ప్రతిమే. మంగళసూత్రం ఆమె మెడని బంధించింది.

ఆమె ఎదురుగా కసాయివాడి దృశ్యం తిరిగి కనుపించింది. అంతే. తాను కూడా తిరిగి పురాతన సంప్రదాయాన్ని అనుసరించవలసినదే. ఆమె బిగ్గరగా అరవడానికి కూడా అశక్తురాలు.

ఆమె కళ్లు మూసుకుంది. ఆమె హృదయభారం అంతా ఆమె కళ్ళల్లో దాక్కుంది.

చిన్ననాటి సరోజ. చిన్నఇల్లు. వాళ్ళమ్మ నాన్నా, వచ్చే పోయేవాళ్ళ నాహ్వానించడంలో చాలా సందడిగా ఉన్నారు. బాజాలు, భజంత్రీలు. ఆమె అక్క పెళ్ళికి ఊరేగింపు అవుతోంది. ఆ జరీచీరలో ఆమె అక్క ఎంత అందంగా ఉందో! తాంబూలా లిస్తున్నారు. పూలహారం మెళ్లో వేసుకున్న ఒకతను పల్లకీ దిగాడు. వాళ్ళమ్మ అతణ్ణి చూపించి చెప్తోంది: 'సరూ అదుగోనే మీ బావ!'

బావ చేతులు చూపి 'ఇలారా, చిట్టి సరూ, అల్లల్లా బజారు కెళ్ళి మిఠాయీ, బొమ్మలూ కొనుక్కుందాం' అన్నాడు. కాని కొత్తచేత దూరంగానే నిలబడి పోయింది.

ఏడుస్తూనే వాళ్ళక్క పల్లకీ ఎక్కింది. కాని కొన్ని రోజులైనాక ఆమె యింటికి తిరిగివచ్చినప్పుడు ఆమె ఎంత అందంగా తయారయింది! ఆమె పెదవులు దొండపండులాగ ఎర్రగా ఉండేవి. ఆమె జరీబట్టల్లో మహారాణీలాగ దర్జాగా ఉండేది.

ఒకసారి అక్క తన బావతో వచ్చింది. తన అమ్మ బావ కాఫీ తాగుతాడేమో కనుక్కు రమ్మని పంపించింది. సరోజ సిగ్గుతోనూ భయంతోనూ దూరంగానే నిల్చుంది. అతను దగ్గరకివచ్చి తనని మరీదగ్గరగా లాక్కున్నాడు.

మోటగా నల్లగా ఉండే పెదిమెలూ, ముక్కుల్లోంచి పొడుగాటి వెంట్రుకలూ, వింతవాసనా,

ఆమెని సమీపిస్తున్నాయి. శక్తి తీరా తెంప మీద ఒక్క దెబ్బకొట్టి విడిపించుకుంది సరోజ.

భయంతో సరోజ కళ్ళు తెరిచింది. మళ్ళీ అదే నిశ్చలాకాశం. పక్షు చీకటిలో గూడుకు పోతు న్నాయి. ఏదీ తన చిన్నతనం? కాలం అనే పునాదిలో కప్పబడిపోయింది. జీవితం అనే గోడ అందులోంచి లేస్తుంది.

తూర్పుదిక్కున రెండు నక్షత్రాలు మినుకు మినుకు మంటున్నాయి, ఇంతలో రెండశ్రు ధారలు సరోజ బుగ్గలవెంబడి కారాయి. ఛా! అపశకునం. ఇది ఆమె శోభనపు దినం. ఇదే గదిలో ఆమె అక్కకి శోభనం అయింది. తిరిగి నేడు తనకి.

సరోజ కంపించింది, అద్దంలో మళ్లీ చూసుకుంది. ఆమె బుగ్గలు ఎర్రగా కంది ఉన్నాయి. ఆమె శరీరం సౌష్టవంగానే ఉంది. కాని, ఆ జబ్బునాటి అక్క! ఆమె చేతులు చీపురు పుల్లల్లాగున్నాయి. ఆ పాలిపోయిన ముఖంలో ఆ తెల్లటిపళ్లు ఎంత భయంకరంగా ఉండేవి. ఆ శూన్యంలోకి చూసే ఆమె చూపులు- అన్నీ ఆమెకి కనిపించాయి. తన పెళ్లికోసం తన అక్క ఎంతో బెంగపెట్టుకుంది. ఆఖరునకూడా 'సరూ, నీ పెళ్లి చూడలేకపోతానే!' అని పలవరించింది.

ఆ మరుక్షణం ఆమె శాంతించింది. సరోజ మంచంమీద నడుంవాల్చింది. ఆ మూల ఒక సాలీడు గూడు అల్లుతూ సరోజని కూడా తన గూడులో పెట్టి కట్టేసింది.

* * *

వేడిగాలి చెంపలకి తగిలి సరోజ కళ్లు తెరిచింది. రెండు పెదిమలు వెదుక్కుంటూ వస్తున్నాయి. సరోజ భయంతో వెనక్కి తుళ్ళిపడింది. ఇంతలో రెండు చేతులు కఠినంగా ఆమెని పట్టుకున్నాయి. బయటంతా అంధకారం! ఆకాశం కూడా కళ్ళు మూసుకుంది ఈ దృశ్యం చూడ్డానికి ఇష్టంలేక-

మోటగా నల్లగా ఉండే పెదిమలూ, ముక్కుల్లోంచి పొడుగాటి వెంట్రుకలూ, వింత వాసనా ఆమెని సమీపిస్తున్నాయి. ఆమె మునపటిలా ఒక లెంపకాయ ఇవ్వబోయింది

కాని ఆమె చేతు లాగిపోయాయి. ఆమె ఇప్పుడు మునపటి సరోజకాదు. ఇప్పుడామె పెళ్లయి బాధ్యత నెత్తిమీద పడిన అర్ధాంగి!

## రక్తగీతం నీడలు

దాశరథి

దీర్ఘ జ్వరంతో బాధపడే కవికి
స్వాగతమిస్తున్నై నరాలు చివికి.
ఆ నరాల అనుక్షణ కంపం
ఈ మృషాలోకం మెడమీద రంపం
జ్వరాన్ని తరిమేసే మంచి మందులు
చేరినై దొంగలు కూర్చున్న చీకటి గొందులు
"మినింజైటిస్" జబ్బు కవిని వదలదు
"స్ట్రెప్టోమైసిన్" ఔషధం చీకటిబజారునుండి కదలదు
గింజుకుని గింజుకుని చనిపోయి కవి
పాడే నెత్తుటిపాట నీడలివి
కవిని బ్రతికించుకోలేని లోకానికి
అభివృద్ధి రాదు, రాదు ఏనాటికి.